# పెళ్ళిపందిరి

.డాక్టర్.విప్పర్తి ప్రణవమూర్తి

**రా**జుగాడి పెళ్ళికి మేము నలుగురు రాజమండ్రి బయలుదేరాం. మా స్నేహితుల్లో వకరొకరికి పెళ్ళిళ్ళు అయిపోతున్నాయి. మేము ఎ.వి.ఎన్. కాలేజి స్టూడెంట్లము. మా చదువులో ఆఖరి సంవత్సరం. నిజ జీవితంలో అడుగు పెట్టే స్థిరపడే సమయం.

ఇటువంటి తాపత్రయం మా పొట్టి రామారావుకి మొదల్నించి ఎక్కువగా వుండేది.

పొట్టి రామారావు ఇప్పుడేమి పొట్టి గాదు. ఐదడుగుల ఎనిమిది అంగుళాల పొడవును ఇండియాలో పొట్టి అని ఎలా అంటాము? కాని మనవాడికా పేరు వచ్చేసింది. మొదటి సంవత్సరం బి.ఎస్సి.లో చేరేటప్పటికి వాడు మాత్రం నాలుగుఅడుగులు మాత్రమే. కాని రెండేళ్ల హాస్టలు భోజనం బాగా వంటబట్టిందో లేక వాడికది పెరిగే వయసో కాని అమ్మోనియా ఎరువు వేసిన హైబ్రిడ్ జాతి కాయకూరగా ఏపుగా పెరిగి పొడవైపోయాడు.

చెప్పదగ్గ గుణాలు అతనికి ఇంకా ఎన్నో వున్నాయి. బినాకా టూత్ పేస్టు ఎడ్వర్టైజ్‌మెంటుకి పనికొచ్చే ఎత్తయిన పళ్ళు, ఆకర్షణీయంగా వుండాలనే తాపత్రయం, శ్రుతి మించి చేసుకునే అలంకరణ, ముఖానికి కోటింగులు ఈ పద్ధతిగా ఏ చిన్నఫంక్షన్‌కు వచ్చినా తనకున్న ఒక్క తెల్ల సూటు, బ్రౌన్ టై వేసుకుని ప్రత్యక్షమయ్యేవాడు.

చిన్నతనంలో తను హైదరాబాద్‌లో చదువు వెలగబెట్టాడు. దానితో హిందీ- ఉర్దూ, ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడి జనాల్ని అదరగొట్టేవాడు. నోటమ్మట సరిగా మాటలు రాని మాకు అసూయగా వుండేది.

రామారావుకి మరొక వింతయిన అలవాటున్నది.

సంవత్సరమంతా వేష్టు చేసుకుని చదవడం దేనికి?

పరీక్ష సమయంలో ఆఖరి నెల లేక పదిహేను రోజులలో సిలబస్ అంతా చదివేయలేమా? మరీ అంత తెలివి తక్కువ వాళ్ళం కాదు కదా అనే దురభిప్రాయం మాలో మాకే లోతుగా పాతుకుపోయి వుండేది. ఇక ఈ ప్రయత్నానికి గానురాత్రంగా మేలుకుని వుండేందుకు, పగలంతా కష్టపడి లిమిట్ లేని కాఫీలకు, సిగరెట్ల- నిత్య ధూపాలకి ఏర్పాట్లు చేసుకునేవాళ్ళం.

చచ్చీ- చెడి అన్ని ఏర్పాట్లు చేసుకుని రాత్రి తొమ్మిది గంటలకు చదువుకి ఉపక్రమించేసరికి మా రామారావు ప్రత్యక్షమయ్యేవాడు.


అప్పుడు అతని పేరు ఆల్ ఇండియా రేడియో. ఏ వయసులో వాన్నైనా, ఆడనైనా, మొగనైనా మాటల్లో దింపి ఎన్నెన్నో కబుర్లు చెప్పి టైమ్ సెన్సు లేకుండా చేసేవాడు. క్లాసులో అమ్మాయిల నందరిని వేరువేరుగా విభజించి గుమ్మడికాయల జాతని, మరో జాతని, ప్రతి ఒక్కరికీ ఉచిత బిరుదులు, మారు పేర్లను ప్రసాదించడంలో మా రామారావు దిట్ట. సున్నుండ, సోడాబుడ్డి, జింటో, అప్పలమ్మ మొదలయినవి ఈయన బహూకరించిన పేర్లలో కొన్ని. 'అప్పలమ్మ నెత్తి మీదకప్పలాట' తనుకట్టిన పాటల బాణీ పిక్‌నిక్‌లో ఎలా పాడాడో చెబుతాడు. లెక్చరర్లని ఎలా బోల్తా కొట్టించాలో చెబుతాడు. ఇక ఇవి అవి యేమిటి యే విషయం వచ్చినా అనర్గళంగా లెక్చర్లు కొట్టేస్తాడు. మాకు స్పృహ వచ్చేసరికి ఏమయిందంటే వంటిగంటై పోయి మేము నిద్రపోయేవాళ్ళం. రామారావుకి మాత్రం నిద్రపోయేది. రూమ్‌కి పోయి చక్కగా రుబ్బేసేవాడు. పరీక్షలో రామారావు మాత్రం మంచి మార్కులతో పాసైపోయేవాడు.

అప్పటినుండి మేము వాడంటే జాగ్రత్త పడ్డాం. అందుకనే మా నారాయణకి వాడంటే కోపం. 'యూస్‌లెస్ ఫెలో, మమ్మల్నీ చదువుకోనీరా ఫూల్' అని తిట్టేవాడు. నారాయణరావు నిజంగా నా ప్రాణ స్నేహితుడు. వాడి వల్ల చాలా ఉపకారాలు పొందాను. కాని వాడు చాలా సన్నగా వుండేవాడు. ఈ వీక్ పాయింటుని తీసుకుని రామారావు నారాయణ్ణి 'శవం' గాడని, 'కొంగ నడక వాడని' గేలిచేసేవాడు. నారాయణ ముష్టి ఘాతాలకి భయపడి ఆ పేర్లను కొంచెం సరిచేసి "స్పాన్" అని మార్చాడు. వాడి దృష్టిలో మాత్రం దాని అర్థం శవం అనే. ఈ తగువు వల్ల నారాయణ రామారావుని మాతో పెళ్ళికి రాకుండా చేద్దామని ప్రయత్నించాడు. నేనే ఏదో విధంగా ఎంటర్‌టైనింగ్ వుంటాడని, కలిసి వుంటే కలదు' సుఖమని వాడిని మాతో వచ్చేందుకు ఒప్పించాను.

మూడోవాడు మా కృష్ణ. బలంగా వుంటాడు. ఈ వరం ఎలా సంపాదించాడో గాని వాడు నిజంగా వృకోదరుడే. వాడిని భోజనానికి పిలిచిన వారు ఎవరయినా గాబరా పడాల్సిందే. హోటల్‌కి వాడితో వెళితే తగాదా. ప్లేట్ల లెక్కకాదు వాడిది అప్పటికి రెడీగా వున్న వాయిలోని అన్ని ఇడ్లీలు, లేక డేగిసాలో వున్న ఉప్మా పూర్తిగా అలా తయారయిన సరుకుని పూర్తిగా ఆరగించేవాడు. పెద్ద స్కేలు పెళ్ళిళ్ళలో ఏదో విధంగా సరిపెట్టుకోవచ్చునని వుబలాట పడుతూ వుంటాడు. వీడు రోజు పెళ్ళికి రడీ.

నాలుగో వాడిని నేను. నా గురించి నేను చెప్పకోవడం అంత బాగుండదు. అంతా కలసి రాజమండ్రి పెండ్లి ఇంటికి సకాలంలో చేరాము.


పెళ్ళి పందిట్లో అంతా సందడిగా తిరుగుతున్నారు. సన్న సన్నగా 'పిలిచిన బిగువటరా' పాట సన్నాయి వాయిద్యగాళ్ళు చక్కగా వాయిస్తున్నారు. మృదంగ వాయిద్యగాడు ఆ పాటలో లీనమై తల, దానితో పాటు జుట్టు, వళ్ళు వేటినీ దాచుకోకుండా వూగిపోతూ వాయించేస్తున్నాడు. మధ్య మధ్య రాజుల్లా డ్రెస్ చేసుకున్న బేండ్ మేళం కూడా



హిందీ పాటల ట్యూనులను వాయిస్తున్నారు.

చిన్న పిల్లలు కొబ్బరి ఆకులతో నేసిన పందిరి స్తంభాలను పట్టుకుని పరుగెడుతూ నన్ను ముట్టుకో ఆటలు ఆడుతున్నారు. వయస్సులో వున్న పెళ్లి కాని అమ్మాయిలు శక్త్యానుసారం ముస్తాబయి వచ్చినవాడికి చిరునవ్వులు, వీరితూపులు సారిస్తూ .కూడా హడావిడిగానే తిరుగుతున్నారు. వీరిని ఒక కంట కనిపెడుతూనే వున్నారు. వారి తల్లులు, పిన్నులు, అత్తలు, పందిరిలో వేసిన కుర్చీలలో సుఖాసీనులైన పెద్దవారు సిగరెట్లు, చుట్టల పొగలు త్రాగుతూ, కర్పూరపు పుల్లల్ని వాసన చూస్తూ, పెళ్లి కాని వారి పిల్లలకి ఆ పందిరిలోనే ఏమయినా భవిష్యత్తు దొరుకుతుందా అని వెతుకుతున్నారు.

రాజు తమ్ముడు మమ్మల్ని గుర్తు పట్టి అన్నగార్ని పెళ్లి కొడుకుని చేస్తున్నారని ప్రక్కనే వున్న విడిది



## ఆరని తడి

ఆ యింటిని వదిలిపెట్టి వస్తోంటే
దుఃఖం తప్ప మరేమీ రాలేదు
ఆ యింట్లో ఆ యిద్దరూ తప్ప
తోడెవ్వరూ లేక ఒంటరి వాళ్లయిన
అమ్మమ్మని, తాతయ్యని వదిలివొస్తుంటే
దుఃఖం తప్ప మరేమీ మాట్లాడలేకపోయాను

ప్రతిరోజూ నిశ్శబ్దంగా
మనుషులే లేని ఇంట్లో తిరిగే నిశ్శబ్దంలా
లోపల ఎక్కడో అమ్మమ్మ పనిచేస్తున్న చప్పుడు తప్ప
మరో శబ్దమేదీ విన్పించదు.
ముందు గదిలో తాతయ్య
పుస్తకాల్లోని పద్యాలలో మాట్లాడుకోవడం తప్ప
ఇక ఆ యింట్లో మరే చప్పుడూ విన్పించదు.
రెక్కలొచ్చక ఎగిరిపోయి
సొంత గూళ్ళను కట్టుకున్న
తనవాళ్ళకై ఎదురుచూసే
రెండు పక్షుల్లా అమ్మమ్మా, తాతయ్య

మీరొస్తున్నారని కలొచ్చిందని
తాతయ్య ఉత్తరంలో రాసిన మాటలే
ఆ యింట్లో దిగగానే
ఆయన కళ్ళల్లో సుడితిరిగిన
కన్నీళ్ళు మళ్ళీ మళ్ళీ చెప్పాయి.

ఇంత మౌనం ఇక్కడ పర్వతంలా పెరిగితే
మా వేసవి సెలవుల
ఆటల పాటల
అల్లరి అరుపుల గుసగుసలతో
ఆ యింట్లోని నిశ్శబ్దాన్ని, ఒంటరితనాన్ని
తప్పిపోసాం.
వృద్ధాప్యం వాళ్ళ ముఖాల మీద
ముడతలుగా సంతకం చేసి
వాళ్ళను ఒంటరితనంలోకి నెట్టి వెళ్ళిపోయింది.
మేమున్న ఆ రెండు నెలలూ
మాతో పసిపిల్లలయ్యే వాళ్ళు
సెలవులు ముగిసిపోయి
మేం తిరిగి ప్రయాణమైనప్పుడు
అమ్మమ్మ దుఃఖాన్ని తాతయ్య
తాతయ్య శోకాన్ని అమ్మమ్మ
విలపించే వాళ్ళు

వాళ్ళక్కడ ఆ ఒంటరితనంలో ఉండలేక
వగర శబ్దాల్లోకి రాలేక
మా ముఖాల్లోకి బెంగగా చూసినప్పుడు
కాలం మీద కోపం
తాతయ్య అయితే దుఃఖాన్ని తుడుచుకొని
బస్సెక్కించాడు గాని
తాతయ్య ఇంటికెళ్ళిందాకా అమ్మమ్మ ఒంటరిదే కదా!
ఆ తరువాత ఇద్దరూ ఒంటరివాళ్ళే
బహుశా ఇంటికెళ్ళిన తాతయ్య - మళ్ళీ వస్తారులెమ్మంటూ
అమ్మమ్మ కన్నీళ్లని తుడిచి తానేడుస్తాడేమో?

— కె. అంజనీబాల

లోనికి మమ్మల్ని ప్రవేశపెట్టాడు. ఏర్పాట్లు ఘనంగా వున్నాయి.

మేమంతా వచ్చినందుకు రాజు చాలా సంతోషించాడు. మాకు ఇబ్బంది కలుగకుండా చూసుకోమని రాజు తమ్ముడికి గట్టిగా చెప్పాడు.

"ఒరేయ్ రాజు! మాకు అటెండెన్సు మార్కు చేశావు గదా! పెళ్ళి పందిరిలో ముహూర్తం టైముకి కలుసుకుంటాం" అని చెప్పి హుటాహుటి విడిదికి వచ్చేశాము. వెంటనే చదువులోనికి దిగిపోయాము. చదువంటే పేకాట. కాని రామారావు నెమ్మదిగా తప్పించుకుని బైటకి వెళ్ళిపోయాడు. వాడికి ఈ చదువు అంతగా పట్టదు లెండి.

పురోహితుల మంత్రోచ్ఛారణాలతో మా వాడి పెళ్ళి పూర్తయింది. కాని ఆ ముహూర్తానికే రామారావులో మార్పు కనిపించింది.

"ఏమిరా ఇలా వున్నావు? వంట్లో బాగోలేదా! ఏమయింది?"

సరి అయిన జవాబు రాలేదు.

వాడా రోజు పెళ్ళి భోజనం కూడా సరిగా చేయలేదు. కృష్ణ మాత్రం యాభై లడ్డూలు యాభై కాజాలు మిగిలిన వాటిని కూడా అదే లెక్కలో ఎక్కించి తేన్చాడు.

సాయంకాలం టిఫిన్ల తరువాత ఈమని శంకర శాస్త్రి గారి వీణ కచేరి ప్రారంభమయింది.

రామారావు విషయంలో కొంచెం అనుమానం అక్కడ వేసింది. వాడి దృష్టి మరొక వైపుంది. సరోజ కూడా మా క్లాస్‌మేట్. పెళ్ళి కొచ్చినట్లుంది. ఆడవాళ్ళ వైపు కూర్చున్న సరోజ, రామారావుల మావులు కలసే వున్నాయి. మధ్యలో చేతులు అడ్డంగా వూపినా రామారావు అదే లోకంలో వున్నాడు. అప్పుడు అర్థమయింది మాకు, వాడికి ప్రేమ రోగమంటుకున్నదని. మేము పేకాడుతున్న సమయంలో రామారావు బైటికి వచ్చినప్పుడు ఆ అమ్మాయితో మాట్లాడే భాగ్యము కలిగిందని వాడు తరువాత చెప్పాడు.

ఇక రాజు పెళ్ళయి ఒకింటి వాడయాడు. వాడిని అభినందించి తిరిగి వైజాగు వచ్చేశాము.

మళ్ళీ రొటీనులో పడ్డాము. క్లాసులు, లేబరేటరీ వర్కు, వగైరా.

అప్పుడప్పుడు రామారావు సరోజ గురించి కొన్ని కుతూహల విషయాలు చెప్పేవాడు. వాడు చెప్పేవాటిలో కొన్నిటిని నమ్మకూడదని, కొన్నిటిని సెన్సారు చేయాలని మాకు తెలుసు.

వాడు చెప్పే విషయాలు, విశేషాలు– సరోజ వరసకి తన మేనత్త కూతురే అని, వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళని, సరోజ తమ్ముడికి కూడా తనంటే ఇష్టమని కాకా పట్టేశాడు. వాళ్ళ వూరు పనిగట్టుకొని వెళ్ళి, సరోజ తల్లిని (తండ్రి చిన్నతనంలో పోయాడట) కలసికొని పళ్ళిచ్చి, కాళ్ళకి నమస్కరించానని....

ఒక సంవత్సరంలో ప్రోగ్రెసు ఏమిటంటే వాళ్ళిద్దరు బీచి లకు, సినిమాలకు ఫ్రీగా తిరగడం. రోడ్ల మీద సరోజ కనబడితే చాలురామారావు మమ్మల్ని చాలా దూరంగా నిలబెట్టి ఇక వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకోవడమే. మేము విసుగెత్తి

"ఇదేమి సోదిరా బాబు"

అనుకుని వాళ్ళిద్దరినీ అలా వదిలేసి కదలిపోయేవాళ్ళం. తత్ఫలితంగా రామారావు కూడా ప్రీ ఫైనల్‌లో ఒక సబ్జక్టు తప్పాడు.

ఆ రోజు కృష్ణ ఒక తాజా వార్త తెచ్చి సంచలనం రేపాడు.

వీడు రామారావుని సరోజని 'మనోహర్'లో చూశాడు. సరోజకి అక్కడ వాంతి అయింది. మేము అంతా ఆశ్చర్యపోయాం. రామారావు ఇంత అడ్వాన్సు అయిపోయాడా అని. కుతూహలాన్ని చంపుకోలేక వాడిని మా రూముకి లాక్కొచ్చి నిలదీసి అడిగాం. వాడు అటువంటిదేమీ లేదని బతిమిలాడుతూ ఈ క్రింది కథ చెప్పాడు.

ఫైవ్ స్టార్ హోటల్‌కి తీసుకుని వెళ్ళిన ఘనతను దక్కించుకుందామని సరోజను హోటలు మనోహర్‌కి తీసుకుని వెళ్లాడు. ఎయిర్ కండిషన్ చలిగానే వుంది. బేరర్లు మసక మసకగా కనిపించినా నీటుగానే వున్నట్టున్నారు. డల్ లైట్లలో తడుముకొని జాగ్రత్తగా వెళ్ళ వలసి వచ్చింది. కులాసాగా కూర్చుని చాలా సేపు సన్నగా వస్తున్న సంగీతం వింటూ మాట్లాడుకున్నారు. ఇలా కొన్ని గంటల యాక బేరరు ఏమిటి అన్నట్టుగా పలకరించాడు.

# భద్రంగా దాచుకున్న టీ



'ఈ టీ ఎట్లున్నద'ని ప్రశ్నించారు లాల్‌బహదూర్ శాస్త్రి ఒక మిత్రునికి టీ అందిస్తూ.

ఇంత మంచి టీ లాల్‌బహదూర్ ఇంట్లో రుచి చూసి మిత్రుడు ఆశ్చర్య పోయాడు.

"బజారులో ఇటువంటి టీ దొరకదు. ఈ టీ విదేశాలకు మాత్రమే ఎగుమతి అవుతుంది. నేను కేంద్ర పరిశ్రమల మంత్రిగా వున్నప్పుడు టీ బోర్డు వారు నాకిది బహూకరించారు" అని చెప్పారు లాల్ బహదూర్.

"పరిశ్రమల మంత్రి పదవి వొదిలిపెట్టి చాలాకాలమైపోయిందిప్పటికీ! ఇంత కాలం వచ్చిందంటే చాలా డబ్బాలే ఇచ్చి వుండాలి" అని కుతూహలం అణచుకొనలేక మిత్రుడనేశాడు.

"మొత్తం మూడు డబ్బాలిచ్చారు. రెండు డబ్బాలు మా ఆఫీసువాళ్ళకిచ్చాను. ఒక డబ్బా మాత్రం ఇక్కడికి తెచ్చాను. మేమీ టీ అప్పుడప్పుడు మాత్రం తాగుతుంటాము. నాకిది చాలా ఇష్టం" అని కేంద్ర మాజీ పరిశ్రమల మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి అనగానే ఆయన నిజాయితీ చూసి మిత్రుడు విస్తుపోయాడు.

– జి. వెంకటరామారావు

వెజిటబుల్ కట్‌లెట్, వెజిటబుల్ బిరియాని, ఆలు మట్టర్ కర్రీ ఆర్డరిచ్చాడు. వాటిని తింటున్నపుడు రామారావు సహజ ధోరణిలో ఫైవ్ స్టార్ హోటళ్ళు, డల్ లైట్ల మీద లెక్చరు ప్రారంభించాడు.

"సరోజా ఈ డిమ్ లైట్లు ఇటువంటి పెద్ద హోటళ్ళలో ఎందుకు పెడతారో తెలుసా?"

"ఊహు తెలియదు. కట్లెట్టు బాగుంది కదూ!"

"తింటున్న వాటిలో ఎండు మిరపకాయ అది కాకపోవచ్చు"

"పోనీలే కాని కవాంటర్‌లో కొత్తిమీర, పోపు వేశారు బాగుంది కదూ"

"ఆవాలు, జీలకర్ర అవి గాకపోవచ్చు"

"సరేలేబాబు. ఇక చెప్పక రుచిగా వున్నాయి తిను" అంది సరోజ.

రామారావు ఊరుకోలేదు.

"ఎండు మిరపకాయలు బొద్దింకలు కావచ్చు! జీలకర్ర, ఆవాలు అలాంటి పురుగులు కావచ్చు! చీకటిలో తినేస్తారు"

సరోజ సడన్‌గా తినడం ఆపి సింకు దగ్గరకెళ్ళి వాంతి చేసుకుని రామారావుని తెగతిట్టి "ఇటువంటి హోటళ్ళకి నన్ను తీసుకుని రాకు" అని వెళ్ళిపోయింది.

కథ నిజమే కావచ్చు.

ఈ చిరు కలహాన్ని అధిగమించి సరోజను ప్రసన్నురాలను చేసుకునేందుకు మరికొన్ని రోజులు అయ్యాయట.

ఇక మేమంతా ఒక నిర్ధారణకి వచ్చేసాము. రామారావు కూడా దగ్గరలో ఎప్పుడో శుభలేఖ ఇచ్చేస్తాడు. ఏమయినా ఘటికుడే. ప్రేమ పెళ్ళిలాగా మేనత్త కూతురునే చేసుకుంటున్నాడు. మేమంతా కొంచెం అసూయ పడిన మాట వాస్తవం.

అదృష్టవశాత్తూ మేము నలుగురం ఫైనల్ పరీక్షలో పాసైపోయాం.

బరువెక్కిన మనసులతో స్నేహితులమంతా వీడుకోళ్ళు తీసుకుని ఎవరి గూళ్ళు వారు చేరాము.

గిర్రున రెండు సంవత్సరాలు గడచిపోయాయి.

ఆ రోజు నారాయణ పెళ్ళి శుభలేఖ వచ్చిన నాడు ఆనందంతో ఉరకలు వేసింది మనసు. స్నేహితులను మళ్ళా చూసుకోవచ్చు. కోస్తా జిల్లాల పచ్చదనాన్ని చూస్తూ ట్రైను మీద, పడవ మీద, బస్సు మీద, గుర్రం బండి మీద ప్రయాణాలు చేసి రిక్షాలో అమలాపురం వెళ్ళి పందిరికి చేరేసరికి సాయంకాలం ఆరుగంటలయింది.

నారాయణ ఆప్యాయంగా స్వాగతం పలికాడు. సాయంత్రం అక్కడ వారి బంధువులు పెద్ద పెద్ద మీసాల మొగవారంతా గుమిగూడారు. భోగం మేళం వాళ్ళకి ఆనవాయితీ, అత్యవసరం. నాకు వాళ్ళ మధ్య కెళ్ళటం సిగ్గేసింది. కాని లోపల హుషారుగానే వుంది.

"సముద్రాలన్నీ సారా అయితే
కాలువలన్నీ కల్లు అయితే
లోకాలకి నేనే రాజౌతా
చక్కని సాని పిల్ల పక్కలో వుండాలోయ్
అదీ ఇదీ కాకపోతే కందిపప్పు నేతి ముక్కాకలసి కొట్టాలోయ్"

సరసాలు, సరదాలుతో అక్కడి పెద్దల్ని చూసేందుకు ఆశ్చర్యం వేసింది.

మరుసటి రోజు పెళ్ళి సమయానికి పెళ్ళి పందిరి చేరాను.




అంతా సందడిగా తిరుగుతున్నారు. సన్నాయి వాయిద్యం, బేండ్ మేళం ఒకరి తరువాత ఒకరు పాటలు వాయిస్తున్నారు.

పందిట్లో చిన్న పిల్లలు ఆటలు, పడుచు పిల్లల పరుగులు, పెద్దల ఆలోచనలు, మళ్ళీ రాజు గాడి పెళ్ళిని తలుపుకు తెచ్చాయి.

"ఒరేయ్ మూర్తి"

అంటూ కృష్ణ పలకరించాడు.

"ఏమిరా ఇంత ఆలస్యం నేను నిన్ననే వచ్చా. ఎంతో ఎంటర్‌టయిన్‌మెంటు మిస్సయావు"

కృష్ణతో పాత కథల్ని మళ్ళీ చెప్పుకుంటున్నాము.

రిక్షాలో దిగుతున్న రామారావును చూశాను. కృష్ణతో "దిగేది రామారావేనా" అడిగాను.

"అవున"న్నాడు.

ఏమిటి రామారావు ఇలా మారిపోయాడు. ఆ చురుకుదనం లేదు. సాధారణ మేకప్. చేతిలో పిల్లెవరు? పక్కన యువతి ఎవరు? సరోజేది?

ఈ ప్రశ్నల వర్షాన్ని కృష్ణపై కురిపించాను.

కృష్ణ జవాబులు చెప్పాడు.

"నీకు తెలియదా? సరోజ డాక్టర్ శేషగిరిని పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళిపోయింది"

ఉక్రోషం పట్టలేక వెంటనే రామారావు మరొక సంబంధం ఒప్పుకుని పెళ్ళి చేసుకున్నాడు. అప్పటి చిలిపితనం, అల్లరి తగ్గిపోయాయి. వైజాగులో షిప్ యార్డులో గుమస్తాగా చేస్తున్నాడు.

అయ్యో అనిపించింది. అయ్యో రామారావు!!

అతడెవడో ఇతని కంటే ఘనుడా?......